సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 27 । జూన్ । 2023



రక్షణ చర్యలపై సదస్సు

జ్యోతినగర్: ఎన్టీపీసీలో భద్రత, రక్షణ చర్యలపై సదస్సు నిర్వహించారు. ఈడీ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. మెరుగైన విద్యుత్ ఉత్పత్తిలో రక్షణ చర్యలు తప్పనిసరి అన్నారు. ఏజీఎం బిజయ్‌కుమార్ సిర్దర్, అధికారులు, పాల్గొన్నారు.



పత్తి క్వింటాల్‌కు రూ.6,538

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,538 పలికింది. కనిష్టంగా రూ.6,008, సరాసరిగా రూ.6,328గా నమోదైనట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
28.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

మంథని: మత్తు పదార్థాలపై యువత అప్రమత్తంగా ఉండాలని మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. మంథని కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి అలవాట్లు ఎంచుకోవాలని, మంచిగా చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.స్వాతిగౌడ్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, న్యాయవాదులు శశిభూషణ్ కాచే, కన్నూరి శ్రీహరితో పాటు తదితరులు ఉన్నారు.

'మక్కాన్‌సింగ్‌పై అసత్య ప్రచారం తగదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు

రామగుండం: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు ప్రజల నుంచి వస్తున్న స్పందనను జీర్ణించుకోలేక స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అసత్య ప్రచారానికి తెరలేపుతున్నారని ఆ పార్టీ నాయకులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఎమ్మెల్యే దిగజారి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించడం వారి అభద్రతాభావానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పట్టణ ప్రతినిధి బదావత్ సారయ్యనాయక్, సిరిశెట్టి సతీష్‌గౌడ్, ఎండీ.గౌస్, సూర తార తదితరులున్నారు.

వ్యవసాయ కళాశాలకు 'గీట్ల' పేరు పెట్టాలి




మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్: కూనారానికి మంజూరైన వ్యవసాయ కళాశాలకు మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత గీట్ల ముకుంద రెడ్డి పేరు పెట్టాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. కూనారంలో వ్యవసాయ పరిశోధన స్థానం ఏర్పాటులో గీట్ల కృషి ఎంతో ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఈవిద్యా సంవత్సరంలోనే కళాశాల తరగతులు ప్రారంభించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మునీర్, మాజీ సర్పంచులు, మాజీ కోఆప్షన్ సభ్యులు, నాయకులు అల్లంల దేవేందర్, గోలి సుధాకర్, దాగేటి రాంచంద్రం, కల్వల శ్యాం పాల్గొన్నారు.

ఎన్టీపీసీ రామగుండం ఈడీ సునీల్‌కుమార్ బదిలీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను ఉత్తరప్రదేశ్‌లోని మేజఉర్జా నిగమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీ చేస్తూ సోమవారం రాత్రి కార్పొరేట్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శీతల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ సీఈవోగా పనిచేస్తున్న కేదార్ రంజన్ పాండును ఎన్టీపీసీ ఈడీగా నియమించారు.

మత్తుకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న హేమంతకుమార్

పెద్దపల్లిరూరల్: యువత మత్తుకు బానిస కావొద్దని, మంచి భవిష్యత్‌ను కోల్పోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే పదార్థాలు, చాకోలెట్స్, కూల్‌డ్రింక్స్ తీసుకోవద్దన్నారు. అనంతరం న్యాయస్థానాల్లో బాధితులకు అందించే న్యాయ సేవలను వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి అర్జున్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి శంకర్, సభ్యులు హనుమాన్ సింగ్ తదితరులున్నారు.

- పార్టీ పునరుజ్జీవంపై కేడర్‌లో చిగురించిన ఆశలు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకుంటున్న కార్యకలాపాలు
- కర్ణాటక తరహాలో 50 శాతం బీసీలకు సీట్లపై అభ్యర్థుల ఆశలు
- అభ్యర్థుల బలాబలాలపై సర్వే ప్రారంభించిన పార్టీ
- అవసరమైతే థర్డ్‌పార్టీ సర్వేకూ సిద్ధం



కాంగ్రెస్‌లో తొలకరి!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: బీడువారిన భూమిలా నిర్జీవంగా ఉన్న ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో కర్ణాటక ఫలితాలు తొలకరిలా ఆశలు రేపుతున్నాయి. దాదాపు దశాబ్దకాలంగా అధికారానికి దూరంగా ఉన్న పార్టీలో మొన్నటి కర్ణాటక అసెంబ్లీ ఫలితాలు ఉత్తేజాన్నిస్తున్నాయి. జాకీలు పెట్టినా పార్టీ లేవదని ఇంతకాలం ప్రకటనలు ఇచ్చిన లీడర్లు ఇప్పుడు సానుకూల ప్రకటనలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న టైంలో జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు అంతే వేగంగా ముందుకు కదులుతున్నారు. కేడర్ కూడా కొత్త ఉత్సాహంతో పనిచేస్తుండటం పార్టీకి కలిసి వచ్చే అంశంగా నాయకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు ఆధ్వర్యంలో జిల్లాలో రహస్యంగా సర్వే చేస్తున్నారు. సర్వే ఆధారంగానే ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్లు ఉంటాయన్న భావనతో నేతలంతా పార్టీ కార్యక్రమాల్లో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొంటున్నారు.

50 శాతంపై రిజర్వేషన్‌పై ఆశ..

రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కర్ణాటకలో వ్యూహాన్ని ఇక్కడా అమలు చేయాలని పార్టీ ఆలోచిస్తున్న తరుణంలో బీసీ నేతలంతా తమ బలాబలాలు, అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 119లో 31 స్థానాలు రిజర్వేషన్లు పోను, 88 స్థానాలు ఉంటాయి. అందులో పాతబస్తీలో ఏడు స్థానాలు ముస్లింలే పోటీ చేస్తారు కాబట్టి.. మిగిలిన స్థానాలు 81 మాత్రమే. ఇందులో 50 శాతం బీసీలకు సీట్లు కేటాయిస్తారని బీసీ నేతలంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ప్రతి పార్లమెంట్ సెగ్మెంటు పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు బీసీలకు కేటాయిస్తారన్న ప్రచారంపైనా అభ్యర్థులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఈ లెక్కన చూసుకున్నా.. ఎంతలేదన్నా బీసీలకు 34 సీట్లు వస్తాయని ధీమాతో ఉన్నారు. ఈ కోవలో ఉమ్మడి జిల్లాలోని మూడు పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో తమకు ఎంత లేదన్నా నాలుగు నుంచి ఐదు స్థానాలు తప్పకుండా వస్తాయని నమ్మకంగా ఉన్నారు.

చేరికలపై ఊహాగానాలు..

కరీంనగర్ జిల్లాలో పలువురు బడా నేతలు పార్టీలో చేరతారన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పార్టీలోకి వస్తారని మీడియాలో జోరుగా ప్రచారం సాగుతున్నా.. ఆయన నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా లేకపోవడం గమనార్హం. జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, గ్రానైట్ వ్యాపారి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. అదే సమయంలో జిల్లాలోని ఓ జెడ్పీటీసీ కూడా ఇదే ప్రయత్నాల్లో ఉన్నారు. వీరిద్దరూ తరచుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కోరినట్లు సమాచారం. మొత్తానికి ఎన్నికల ముందు తమ పార్టీ బలోపేతం అవుతోందని కేడర్ భావిస్తోంది.

సర్వే మొదలు

2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఉమ్మడి జిల్లాలో పార్టీ ప్రభ క్రమంగా మసకబారింది. 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి నుంచి జి.వివేక్, నిజామాబాద్ నుంచి మధుయాష్కీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు. కానీ.. అసెంబ్లీ విషయానికి వచ్చేసరికి మహాకూటమి కారణంగా కేవలం మానకొండూరు, హుస్నాబాద్, మంథని మూడు అసెంబ్లీ స్థానాలకు పరిమితమైంది. తర్వాత 2014లో జగిత్యాల నుంచి జీవన్‌రెడ్డి, 2018లో మంథని నుంచి శ్రీధర్‌బాబు, రామగుండం నుంచి కోరుకంటి చందర్ (ఏఐఎఫ్‌బీ) మినహా మిగిలిన స్థానాలన్నీ టీఆర్ఎస్ ఎగరేసుకుపోయింది. అందుకే, ఈసారి అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పకడ్బందీగా వ్యవహరిస్తోంది. సునీల్ కనుగోలు టీమ్‌లు ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో రహస్యంగా పర్యటిస్తున్నాయి. ఈ సర్వే ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్లు కేటాయించనుంది. ఎక్కడైనా సర్వే నుంచి స్పష్టమైన వివరాలు రాకపోతే థర్డ్ పార్టీకి వెళ్లనుందని సమాచారం.

నియోజకవర్గాల వారీగా...

కరీంనగర్, పెద్దపల్లి మినహా ఏ అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థుల మధ్య పోటీ లేకపోవడం ఆ పార్టీకి కలిసి వచ్చే అంశంగా కనిపిస్తోంది.

- వేములవాడలో ఆది శ్రీనివాస్ వరుసగా ఓటమి పాలైనా తన చిరకాల ప్రత్యర్థి చెన్నమనేని రమేశ్‌పై పోరాటం సాగిస్తూనే ఉన్నారు. వేములవాడ ఆలయం, స్థానిక సమస్యలపై ప్రతిరోజూ కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డి ఈసారి సత్తా చాటాలని చూస్తున్నారు.
- మానకొండూరు నుంచి మూడుసార్లు పోటీ చేసిన కవ్వంపల్లి సత్యనారాయణ కొంతకాలంగా ఉత్సాహంగా దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలతో కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది.
- హుజూరాబాద్‌లో బల్మూరి వెంకట్ కూడా క్రియాశీలకంగానే ఉన్నారు.
- హుస్నాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తిరిగి పార్టీలో చేరి, ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.
- చొప్పదండి నుంచి మేడిపల్లి సత్యం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు.
- కరీంనగర్‌లో పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఒకరికి టికెట్ కేటాయించే అవకాశముందని నేతలు చెబుతున్నారు.
- జగిత్యాల నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రతీరోజు ప్రెస్‌మీట్లు, సమావేశాలతో బిజీగా ఉంటున్నారు.
- కోరుట్ల నుంచి జువ్వాడి నర్సింగరావు మరోసారి బరిలోకి దిగనున్నారు.
- ధర్మపురి నుంచి అడ్లూరి లక్ష్మణ్ ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్నారు. క్రితంసారి తన ఎన్నికపై న్యాయపోరాటం చేస్తున్న ఆయన ఈసారి ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధిస్తానన్న ధీమాతో ఉన్నారు.
- పెద్దపల్లి నుంచి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావును గతంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ప్రకటించారు. బీసీ కోటా కింద జెడ్పీటీసీ గంటా రాములు, డీసీసీ మాజీ అధ్యక్షుడు కొమురయ్య ప్రయత్నిస్తున్నారు.
- మంథని నుంచి శ్రీధర్‌బాబు మరోసారి విజయంపై నమ్మకంగా ఉన్నారు.
- రామగుండం నుంచి ఈసారి గెలిచి తీరాలని మక్కాన్‌సింగ్ పట్టుదలగా ఉన్నారు.



మాట్లాడుతున్న ఆదిరెడ్డి

మేలురకం విత్తనాలనే ఎంచుకోవాలి

- వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో..
- జూలై 15 వరకూ పత్తి సాగు చేసుకోవచ్చు
- వరి వెదజల్లే పద్ధతి పాటిస్తే ఖర్చు ఆదా
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

పెద్దపల్లిరూరల్: వానాకాలం పంటలు సాగుచేసే రైతులు మేలురకమైన విత్తనాలు ఎంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి సూచించారు. వానాకాలం సీజన్ నేపథ్యంలో 'సాక్షి' సోమవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు వెలిబుచ్చిన సందేహాలకు డీఏఓ ఆదిరెడ్డి సమాధానాలిచ్చారు. ఈసారి వర్షాలు కురవడం కొంత ఆలస్యమైందని, అయినా ఆందోళన అవసరం లేదని, పత్తిని జూలై 15 వరకూ విత్తుకోవచ్చని వివరించారు. వరి 120 రోజుల్లో దిగుబడిచ్చే స్వల్పకాలిక రకాలను సాగు చేయాలని, వెదజల్లే పద్ధతి పాటిస్తే ఖర్చు ఆదా చేసుకోవచ్చన్నారు.

ప్రశ్న: వర్షం లేక ఇంకా నారు పోయలేదు. వరి సాగుకు పాటించాల్సిన పద్ధతులేంటి..?

– సంపత్‌రెడ్డి, కొలనూర్, ఓదెల మండలం

డీఏఓ: పంటల సాగు ఆలస్యమైందని ఆందోళన వద్దు. స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638 వంటి రకాలను వేసుకుంటే 125నుంచి 135 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది. నారుపోయకుండా వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్‌తో సాగు చేస్తే సమయం, ఖర్చు ఆదా అవుతుంది.

ప్రశ్న: పత్తిని ఎప్పటిలోగా విత్తుకోవచ్చు..?

– కిరణ్, జూలపల్లి

డీఏఓ: ఇప్పటివరకు జిల్లాలో కేవలం 7.1మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఇపుడు వానలు సమృద్ధిగా కురిసే అవకాశముంది. జూలై 15 వరకు విత్తనాలు వేసుకోవచ్చు. భూమితడి లేకుంటే విత్తనాలు సరిగా మొలకెత్తవు.

ప్రశ్న: మిరప, టమాట సాగుచేస్తే ఆశించిన దిగుబడి రావడం లేదు..?

– ఓదెల రాజు, బ్రాహ్మణపల్లి, పెద్దపల్లి

డీఏఓ: కూరగాయల సాగుకు సంబంధించి ఉద్యానవన శాఖ అధికారులను రైతు వేదికకు పంపిస్తాం. మీ సందేహాలన్నింటిని వారు నివృత్తి చేస్తారు. ఆ సమయాన్ని మీకు తెలుపుతాం.

ప్రశ్న: పత్తి విత్తనాలను ఎక్కువ ధరలకు అమ్ముతున్న డీలర్లపై చర్యలు తీసుకున్నారా..?

– జి.సురేశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు, పెద్దపల్లి

డీఏఓ: కల్తీ, నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేస్తున్నాయి. విత్తనాలు కొనేముందు రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. డీలర్లు ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: అధిక దిగుబడినిచ్చే కొత్త విత్తనాలొచ్చాయా..?

– ఎర్రం మల్లారెడ్డి, కాసులపల్లి, పెద్దపల్లి మండలం

డీఏఓ: వ్యవసాయ పరిశోధన కేంద్రాలనుంచి వచ్చిన కొత్తరకం విత్తన కిట్లను ఎంపిక చేసిన పెద్దపల్లి, మంథని ప్రాంత రైతులకు ఇచ్చాం. ఈ సీజన్‌లో సాగుచేస్తున్నారు.

ప్రశ్న: రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నారా..?

– నెత్తెట్ల కుమార్, చందపల్లి

డీఏఓ: రాయితీపై యాంత్రీకరణ పనిముట్లు ఇవ్వడంలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలందితే రైతులకు సమాచారమిచ్చి అందిస్తాం. ప్రస్తుతానికైతే పెట్టుబడిసాయంగా రైతుబంధు వర్తింపజేస్తోంది.

ప్రశ్న: వరి అధికదిగుబడులు సాధించాలంటే..?

– పత్తి రాజేశం, ఓదెల

డీఏఓ: వరిపంట సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో అధికదిగుబడులను సాధించవచ్చు. ఎకరానికి కేవలం 10–12కి లోల విత్తనం నానబెట్టి వెదజల్లాలి. వారం తర్వాత గడ్డిమందు అసట్, నామినిగోల్డ్ చల్లాలి.

ప్రశ్న: వరి 1001, 1153 రకాలను సాగుచేసుకోవచ్చా..?

– కొమ్ము మహేశ్, కొలనూర్, ఓదెల మండలం

డీఏఓ: ఆ రకం వరి రకాలపై ఎలాంటి నిషేధమూ లేదు. ఆ రకం పంట దిగుబడిని కామన్ రకంగా గుర్తించి కొనుగోలు చేస్తారు.

ప్రశ్న: వరిలో యాజమాన్య పద్ధతులు..?

– లక్ష్మారెడ్డి, కాల్వశ్రీరాంపూర్

డీఏఓ: నాణ్యమైన విత్తన ఎంపిక, విత్తిన తర్వాత నీటిని సరిపోయేంతగా వినియోగించడం మంచిది. విత్తనాలను కార్బోఫ్యూరాన్‌తో కిలో ఎకరానికి కలిపి విత్తితే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.

యువత సత్ప్రవర్తనతో మెలగాలి

- చెడుమార్గంలో పయనించొద్దు
- భవిష్యత్తు పాడుచేసుకోవద్దు
- అదనపు కలెక్టర్ బి.లక్ష్మీనారాయణ
- జిల్లాకేంద్రంలో మిషన్ పరివర్తన



మిషన్ పరివర్తనలో అదిషనల్ కలెక్టర్, డీఎంహెచ్ఓ తదితరులు

పెద్దపల్లిరూరల్: యువత సత్ప్రవర్తనతో మెలగాలని, భవిష్యత్తుకు మార్గం వేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా డీసీపీ వైభవ్ గైక్వాడ్‌తో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యువత మంచి, చెడు తెలుసుకుని క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడే లక్ష్యాన్ని సాధించి గొప్ప స్థానానికి చేరుకోవచ్చని సూచించారు. యువత వక్రమార్గంలో పయనించి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కుటుంబంలో తల్లిదండ్రులు పడే బాధలను వివరిస్తూ కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. భావిభారత పౌరులు డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని, అందుకే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో సాంకేతికత పరిజ్ఞానం పెరిగిందని, పిల్లల్లో ఆలోచనాశక్తి పెరిగే వరకూ సెల్‌ఫోన్ ఇవ్వకపోవడం మంచిదని అభిప్రాయపడ్డారు. పిల్లల ఫోన్ వాడకంపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పిల్లలకు తెలుగులోనే శతకాలు, పద్యాలు చెబుతూ వాటి భావం వివరించాలని, భాస్కర, వేమన, సుమతి శతకాల వలన పిల్లలలో మంచి పరివర్తన, ఆలోచనా విధానం వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్, డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డాక్టర్ మహేందర్, సఖీ కేంద్ర నిర్వాహకులు తదితరులున్నారు. మాదకద్రవ్యాల నివారణ, డ్రగ్స్ నివారణకు రూపొందించిన పోస్టర్లను అదనపు కలెక్టర్ ఆవిష్కరించి ప్రమాణం చేయించారు.

కార్మికులపై మొండి వైఖరి వీడాలి



మాట్లాడుతున్న జనార్దన్

జ్యోతినగర్: ఎన్టీపీసీలోని కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం అమలుపై యాజమాన్యం మొండివైఖరి వీడి వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జేఏసీ నిరసన కార్యక్రమాలకు తమ యూనియన్ మద్దతిస్తుందని, సమస్య పరిష్కారమయ్యే వరకూ పోరాడాలని సూచించారు. రాజకీయ నాయకులు కార్మికులను ఓటు బ్యాంక్‌గా కాకుండా వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. యాజమాన్యం జేఏసీతో శాంతియుత వాతావరణంలో చర్చించి కార్మికుల పట్ల సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణిలో 45 దరఖాస్తుల స్వీకరణ
- వినతులు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్లు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్‌కు వినతిపత్రాలు అందించారు. జిల్లాలోని పలు మండలాలనుంచి 45మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 23 రెవెన్యూ సంబంధమైనవి కాగా.. 22 అర్జీలు వివిధ శాఖలకు చెందినవని అధికారులు తెలిపారు. అంతర్గాం మండలంలో వీధిదీపాల ఏర్పాటుపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ సాయి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. పెద్దపల్లిలోని ఇందిరానగర్‌లో అనుమతిలేకుండా పశువులను వధిస్తూ మాంసం అమ్ముతున్నారని, చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

పట్టా పాసుపుస్తకం ఇప్పించండి

ఇందుర్తిలో అసైన్డ్ భూములకు పట్టాపుస్తకాలు పంపిణీ చేయాలని రైతులు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. 1989 నుంచి ఎస్సీలకు సర్వేనంబర్ 354లో 84.19 ఎకరాలు, సర్వేనంబర్ 151లో 13గుంటలు, 156లో 15.17 ఎకరాలు సాగు చేసుకుంటున్నామని, తాతల నుంచే మోఖాపై ఉన్న తమకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. మాజీ సర్పంచ్ పంగ ఆనందం, రైతులు అంబాల రవి, అంబాల ఉమాపతి తో పాటు పలువురు రైతులు ఉన్నారు. – ఓదెల

పైప్‌లైన్ తీయించండి



రామగిరి మండలం ముస్త్యాలలో నా పట్టా భూమిలోనుంచి అక్రమంగా పైప్‌లైన్ వేసిన్రు. తొలగించాలని కోరినా పట్టించుకుంటలేరు. నాకు తెలియకుండా నా భూమిలో వేసిన పైప్‌లైన్ తొలగించేలా చర్యలు తీసుకోవాలి. – మండల రాజిరెడ్డి, ముస్త్యాల

పింఛన్ ఇప్పించండి



నా భర్త రాజేశం మరణించడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వితంతు పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటికీ అధికారులు మంజూరు ఇవ్వడం లేదు. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. – కలవేన లక్ష్మి, తుర్కలమద్దికుంట

కొడుకు పట్టించుకుంటలేడు



సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయ్యా. నేను నాభార్య కొమురమ్మ వృద్ధాప్యంపైబడి రోగాలతో సతమతమవుతున్నం. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నా కొడుకు పట్టించుకుంటలేడు. మేం ఎలా బతుకుడు. మాకు ఏదన్న సాయం చేయాలె. – కొమ్ము శంకరయ్య, కొమురమ్మ, గోదావరిఖని

క్లుప్తంగా

ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి 41వ వార్షికోత్సవం



కార్యక్రమంలో మహిళా సమితి సభ్యులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి 41వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉషాకుమార్ స్వాగతోపన్యాసం చేశారు. జనరల్ సెక్రటరి సుహాసిని వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం విభిన్న సంస్కృతులు ప్రతిబింబించే నృత్యాలు, 'ఘర్‌ఘర్‌కికహానీ' స్కిట్ ఆకట్టుకుంది. విజేతలకు బహుమతులను అందించారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న లక్ష్మణ్

మంథని: మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన పోయిల లక్ష్మణ్ హైదరాబాద్‌లోని మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి చేతుల మీదుగా సోమవారం డాక్టరేట్ అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్ రైల్వే గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్‌కు చెందిన రాకేశ్, మహేశ్, మధుకర్‌లు సోమవారం ద్విచక్రవాహనంపై పనిమీద బయట కు వెళ్లి, తిరిగి వస్తున్నారు. రైల్వే గేట్ సమీపంలో కుక్క అడ్డురావడంతో ఢీకొట్టారు. ఈ ప్ర మాదంలో వాహనం కిందపడటంతో రాకేశ్, మహేశ్‌లు గాయపడగా కుక్క మృతి చెందింది.

రైలులో 250 కిలోల నల్ల బెల్లం పట్టివేత



నిందితులు, బెల్లంను చూపుతున్న పోలీసులు

రామగుండం: జమ్మూ నుంచి చెన్నై వైపు వెళ్తున్న అండమాన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో నల్ల బెల్లం రవాణా జరుగుతున్నట్లు రైల్వే పోలీసులకు ఆదివారం రాత్రి సమాచారం అందింది. ఈ మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్సై బి.వెంకటేశ్, హెడ్‌కానిస్టేబుల్ డి.అయిలయ్య సదరు రైలు రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 250 కేజీల నల్ల బెల్లం పట్టుకున్నారు. ఇద్దరు మహిళలు అంబలి అలియాస్ అమ్ములు, ధరావత్ లక్ష్మి (కేసముద్రం-మహబూబాబాద్ జిల్లా)లను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, బెల్లంను, నిందితులను ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు ఆర్పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ తెలిపారు.

అలంకారప్రాయంగా సీబీపీ మెషిన్లు



బసంత్‌నగర్ పీహెచ్‌సీలో సీబీపీ మెషిన్

- రియేజెంట్స్ లేక నిరుపయోగం
- జిల్లావ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో ఇదే పరిస్థితి

పాలకుర్తి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రక్త పరీక్షలు నిర్వహించి.. రోగాన్ని నిర్ధారించేందుకు దోహదపడే సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) మెషిన్లు అలంకారప్రాయంగా మారాయి. మిషన్లలో వినియోగించే రియేజెంట్స్ నెలరోజులకు పైగా సరఫరా లేక సేవలు నిలిచిపోయాయి.

జిల్లావ్యాప్తంగా 25 ఆరోగ్యకేంద్రాలు

జిల్లాలో ఏడు యూపీహెచ్‌సీలు, 18 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు వచ్చే రోగుల సౌకర్యార్థం అన్ని పీహెచ్‌సీలో సీబీపీ యంత్రాలు ఏర్పాటు చేశారు. గతేడాది డిసెంబర్‌లో దాదాపు అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసినా.. నిర్వహణ మాత్రం మరిచారు. ఒకసారి సీబీపీ మెషిన్‌లో రియేజెంట్స్‌ను నింపడం ద్వారా దాదాపు 300 మంది వరకు రోగ నిర్ధారణ పరీక్షలు చేసే అవకాశం ఉంటుంది. ఇందుకు దాదాపు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చవుతుంది. పీహెచ్‌సీలలో బడ్జెట్ కేటాయింపులు లేని కారణంగా మిషన్ల నిర్వహణ భారంగా మారిందని ఆరోగ్య సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీలలో షుగర్, హెచ్‌బీ, మలేరియా, టీబీ తదితర మాన్యువల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో రోగ నిర్ధారణ చేసే సౌకర్యం లేని కారణంగా ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని, ఫలితంగా ఆర్థికభారం పడుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీ డయాగ్నోస్టిక్ ఏర్పాటు కారణంగానే..

జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రంలో కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలతోపాటు థైరాయిడ్, ఇతర రక్తపరీక్షలన్నీ ఒకేచోట నిర్వహించేలా చర్యలు చేపట్టారు. పీహెచ్‌సీలకు వచ్చే వారి నుంచి రక్తనమూనాలను సేకరించి జిల్లాకేంద్రంలోని డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపించి రిపోర్టులు అందించనున్నారు. త్వరలో డయాగ్నోస్టిక్ కేంద్రం ప్రారంభం కానున్న నేపథ్యంలోనే పీహెచ్‌సీలలోని సీబీపీ మిషన్లలో రియేజెంట్స్‌ను సరఫరా చేయడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

డయాగ్నోస్టిక్ కేంద్రంలోనే అన్ని పరీక్షలు..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో కేంద్రం ప్రారంభం కానున్నది. అక్కడ అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తాం. పీహెచ్‌సీలలో ల్యాబ్ టెక్నీషియన్‌లు రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపిస్తారు.

– ప్రమోద్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌ఓ

మధ్యంతర భృతి అమలు చేయాలి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు మొదటి పీఆర్సీ ఈ నెలతో ముగుస్తుందని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ తెలిపారు. కొత్త పీఆర్సీని నియమించి, జూలై నుంచి మధ్యంతర భృతి అమలు చేయాలని కోరారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలో సోమవారం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, రామయ్య, రవీందర్, నాగరాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్

బీఆర్‌ఎస్‌లో గ్రూపుల్లేవ్.. విభేదాల్లేవ్



సమావేశమైన రామగుండం మేయర్, కార్పొరేటర్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్‌కు సంబంధించి బీఆర్‌ఎస్‌లో ఎలాంటి విభేదాలు, గ్రూపుల్లేవని మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు తెలిపారు. మేయర్‌పై సొంత పార్టీ కార్పొరేటర్లే అసంతృప్తితో ఉన్నారని, అవిశ్వాసం పెడతారని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో మేయర్, డిప్యూటీ మేయర్, కొందరు కార్పొరేటర్లు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశమై, అలాంటిదేమీ లేదని తేల్చిచెప్పారు. మేయర్, డిప్యూటీ మేయర్ కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకొని, డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేయించేందుకే ఇటీవల కార్పొరేటర్లు సమావేశమైనట్లు వెల్లడించారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటించారు. సమావేశంలో కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి, బాలరాజ్ కుమార్, కవితా సరోజిని, శంకర్ నాయక్, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, తానిపర్తి గోపాలరావు, కల్వల సంజీవ్, జేవీ రాజు, బొడ్డు రవీందర్ పాల్గొన్నారు.

రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి, బైక్‌తో దాన్నే ఢీకొట్టి

- అంతర్గాం టీటీఎస్‌లో ఒకరి దుర్మరణం

రామగుండం: రోడ్డుపై తాను నిలిపిన ట్రాక్టర్‌ే ఓ వ్యక్తికి మృత్యువైంది. బైక్‌పై వచ్చిన అతను ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన అంతర్గాం టీటీఎస్‌లో చోటుచేసుకుంది. అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దారంగుల మల్లయ్య(55) ఆదివారం రాత్రి తన ట్రాక్టర్ నడుపుతూ ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో డీజిల్ అయిపోవడంతో వాహనాన్ని రోడ్డుపై నిలిపాడు. ఇల్లు సమీపంలోనే ఉండటంతో వెళ్లి, ద్విచక్రవాహనంపై క్యాన్‌లో డీజిల్ తీసుకువస్తున్నాడు. రోడ్డుపై ఉన్న ట్రాక్టర్‌ను గమనించకుండా వెనక నుంచి బలంగా ఢీకొట్టడంతో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో ప్రమాదం



గాయపడిన శ్రీనివాస్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో ప్రమాదం జరిగి, ఓ కాంట్రాక్టు కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. ఎన్టీపీసీ థర్మల్ పవర్ ప్రాజెక్టులో గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన చకిలం శ్రీనివాస్ సోమవారం స్టేజీ-2 ఈఎస్‌పీ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఆకస్మాత్తుగా ఎలక్ట్రికల్ ఫ్లాష్ ఓవర్ కావడంతో అతను గాయపడ్డాడు. తోటి కార్మికులు పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధ్వనంతరి ఆస్పత్రిను ంచి హైదరాబాద్ తరలి ంచారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): మండలంలోని ఖిలావనపర్తి శివారు వ్యవసాయ బావిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అశ్విని తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. జూలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన సిద్దిఖాబేగం(68)కు మూడు పెళ్లిళ్లయ్యాయి. వివిధ కారణాలతో ఆమె విడాకులు తీసుకుంది. ఒక కూతురు సంతానం కాగా కానంపెల్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి, వివాహం జరిపించింది. ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్న ఆమె అప్పుడప్పుడు కూతురు ఇంటికి వస్తూపోతుంటుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, సోమవారం బావిలో దూకింది. మృతురాలి కూతురు షేక్ షమీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జ్యోతినగర్(రామగుండం): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నపూర్ణకాలనీకి చెందిన ఈదునూరి రాజేశం శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి, తన కుటుంబసభ్యులతో ఊరెళ్లాడు. ఆదివారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా టీవీ, గ్యాస్ సిలిండర్ తోపాటు అర తులం బంగారు కమ్మలు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లు భావించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.జీవన్ పేర్కొన్నారు.

బల్దియాలో కొట్టుకున్న కాంట్రాక్టర్లు?

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో సోమవారం ఇద్దరు కాంట్రాక్టర్లు ఓ టెండరు విషయంలో కొట్టుకున్నట్లు తెలిసింది. చిన్న వివాదం ఇరువర్గాలు దాడులు చేసుకునే వరకు వెళ్లడంతో తోటి కాంట్రాక్టర్లు సద్దుజెప్పినట్లు సమాచారం. ఈ ఘటన బల్దియాలో చర్చనీయాంశంగా మారింది.

బస్సు ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

- ప్రైవేటు బస్సు బోల్తాపడి, 45 మందికి గాయాలు
- బోసిపోయిన నూతన పెళ్లికూతురు ఇల్లు
- బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ

రామగుండం: జెన్‌కో ఉద్యోగి బాబా కూతురు రిసెప్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో 45 మంది గాయపడిన ఘటనతో నూతన వధువు ఇల్లు బోసిపోయి కనిపించింది. సమాచారం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సుల్తానాబాద్, కరీంనగర్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే వైద్యానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని, ఎవరికైనా సీరియస్‌గా ఉంటే హైదరాబాద్‌కు తరలించి ఉన్నత వైద్యం అందిస్తానన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

సుల్తానాబాద్(పెద్దపల్లి): బస్సు ప్రమాదంలో గాయపడిన 35 మందిని సుల్తానాబాద్ ఆసుపత్రికి తీసుకురాగా.. వారికి వైద్యులు రమాదేవి, స్వాతి ప్రాథమిక చికిత్స అందించారు. స్వల్పంగా గాయపడిన వారిని ప్రైవేట్ వాహనంలో వారివారి ఇళ్లకు పంపించారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు ఆసుపత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు.



సీకాలనీలో నిర్మానుష్యంగా పెళ్లి కూతురు గృహం



బాధితులను పరామర్శిస్తున్న మక్కాన్‌సింగ్



సుల్తానాబాద్ ఆస్పత్రి వద్ద విజయరమణారావు

బొగ్గుబాయి వార్తలు

ఉద్యోగుల ఆరోగ్యమే సింగరేణి ధ్యేయం

- ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు
- ఓసీపీ-1లో కార్డియాక్ స్క్రీనింగ్ క్యాంపు ప్రారంభం



ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): ఆరోగ్యవంతమైన ఉద్యోగులతో సింగరేణి అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. సోమవారం ఓసీపీ-1లో గుండె సంబంధ వ్యాధుల నిర్ధారణ కోసం కార్డియాక్ స్క్రీనింగ్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులపాటు ఈ క్యాంపు కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగుల గుండెపోటు మరణాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. మారుతున్న జీవన శైలి, ఆహార అలవాట్లే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. స్క్రీనింగ్ క్యాంపు ద్వారా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏవైనా సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించి, ప్రాణాపాయం నుంచి బయట పడే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతీ ఉద్యోగి ఈ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, గౌతం శంకరయ్య, గని మేనేజర్ ఉదయ్‌హరిజన్, ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న జీఎం మనోహర్

- ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని(రామగుండం): నిరంతర అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. గోదావరిఖనిలోని నిమ్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా ఎంపిక చేసిన 32 మంది ఈఅండ్‌ఎం ఇంజినీర్లకు ఎలక్ట్రికల్ సేఫ్టీ, ఆపరేషన్స్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ సిస్టం నిర్వహణ, విద్యుత్ భద్రతా చర్యలు తదితర అంశాలపై రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎలక్ట్రికల్ డీవైజీఎంఎంఎస్ కె.సత్యనారాయణయాదవ్, నిమ్ ఎస్ఈ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ మార్కెటింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్

గోదావరిఖని(రామగుండం): కోల్ మార్కెటింగ్‌పై మార్కెటింగ్ జీఎం సూర్యనారాయణ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏరియాల వారీగా బొగ్గు డిస్పాచ్ వివరాలు తెలుసుకొని, ఈ-సేల్‌లో రోడ్ ద్వారా కస్టమర్లకు మొదటి ప్రాధాన్యత నిచ్చి, మూడు నెలల్లో ఆర్డర్స్ క్లియర్ చేయాలని సూచించారు. బొగ్గు డిస్పాచ్ వివరాలను టీకోడ్ ద్వారా ఏరోజుకారోజు శాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్జీ-2 జీఎం మనోహర్, ప్రాజెక్టు అధికారులు మధుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ వెంకటమోహన్, వకీల్‌పల్లి గని మేనేజర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వెహికిల్ ట్రాకింగ్ సిస్టం పనితీరుపై సమీక్ష



వీసీలో జీఎం మనోహర్, అధికారులు

గోదావరిఖని(రామగుండం): బొగ్గు రవాణాపై నిరంతరం నిఘా ఉంచే వెహికల్ ట్రాకింగ్ సిస్టంను సమర్థంగా ఉపయోగించుకోవాలని సింగరేణి డైరెక్టర్(పా) బలరాం సూచించారు. సోమవారం అన్ని ఏరియాల జీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రవేశపెట్టిన వెహికిల్ ట్రాకింగ్ సిస్టం పనితీరు, ముందు చేపట్టాల్సిన సాంకేతిక అభివృద్ధి పనులపై చర్చించారు. సింగరేణిలో ట్రాకింగ్ సిస్టం ప్రవేశపెట్టిన తర్వాత ప్రతి వాహనం కదలికను కెమెరాల ద్వారా ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కోల్ లోడింగ్ నుంచి డంపింగ్ వరకు అంతా రికార్డవుతుందని పేర్కొన్నారు. ఆర్జీ-1 ఏరియాలో వెహికిల్ ట్రాకింగ్ సిస్టం చక్కగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు, క్వాలిటీ జీఎం కేపీ రావు, క్వాలిటీ డీజీఎం ఎస్.శ్రీధర్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియాలో..

బొగ్గు రవాణాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్(పా)బలరాం ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్‌కు సూచించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయనతో మాట్లాడారు. వెహికల్ ట్రాకింగ్ సిస్టంను సమర్థంగా వినియోగించాలన్నారు. వర్షాకాలంలో బొగ్గు రవాణాకు ఇబ్బంది కలగొద్దని చెప్పారు. బొగ్గు తరలింపునకు వినియోగిస్తున్న లారీల వివరాలు, బొగ్గు రవాణాకు అంతరాయం కలగకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను జీఎం డైరెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం బచ్చ రవీందర్, డిప్యూటీ క్వాలిటీ మేనేజర్ వెంకటమోహన్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులు.. ఆనందంలో రైతులు

- ఊరటనిచ్చిన తొలకరి
- పత్తికి ప్రాణం
- వరి నారు పోసుకునేందుకు సన్నద్ధం



మొలకెత్తుతున్న పత్తి

మంథని: నైరుతి రుతుపవనాల రాకతో రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు తొలకరి ఊరటనిచ్చింది. ఇటీవల పత్తి విత్తనాలు వేయగా మొలకెత్తుతున్నాయి. దీంతో వాటికి ప్రాణం పోసినట్లయింది. అలాగే వరి నారు పోసుకునేందుకు ఈ వాతావరణం అనుకూలం కావడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పత్తి సాగుకే మొగ్గు

గత వేసవి సీజన్‌లో వరి సాగు చేసిన రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బంది పడ్డారు. చేతికందిన పంట వర్షానికి పలుమార్లు తడిసిపోవడం, ధాన్యం కొట్టుకుపోవడంతోపాటు 15 రోజులకు పైగా కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాశారు. ఈ నేపథ్యంలో వరి వేసి, కష్టాలు పడే కంటే పత్తి సాగుతో ప్రయోజనం ఉంటుందని చాలామంది ఈసారి పత్తికే మొగ్గు చూపారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష ఎకరాల్లో ఈ పంట సాగు చేసినట్లు సమాచారం. మంథని డివిజన్‌లోని నాలుగు మండలాల్లోనే సుమారు నలభై వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు.

వరినార్లకు అనుకూలమే..

నీటి ఆధారిత ప్రాంతాల్లో వరినార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే భూమి చదును చేసుకొని, దుక్కులు దున్నినవారు మూడు రోజుల ముసురుతో నార్లు పోసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత వానాకాలంలో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఈసారి సుమారు 2 లక్షల ఎకరాల మేర సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం తొలి ఏకాదశి పండుగ తర్వాత రైతులందరూ వ్యవసాయ పనుల్లో బిజీగా మారనున్నారు.

ఈసారి పత్తి వేసిన..



గతేడాది ఆరెకరాలు కౌలుకు తీసుకొని, వరి సాగు చేసిన. ఆశించిన దిగుబడి రాకపోగా ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడ్డా. కౌలు పైసలు కూడా మిగలలేదు. ఈసారి ఐదెకరాలు కౌలుకు తీసుకొని, పత్తి సాగు చేస్తున్న. ప్రయోజనం ఉంటుందని ఆశిస్తున్నా.

– కందునూరి రమేశ్, రైతు, మంథని

నష్టపోతానని అనుకున్న..



పది రోజుల కిందే ఐదెకరాల్లో పత్తి విత్తనాలు వేసిన. కానీ వర్షాలు లేకపోవడంతో ఎక్కడ నష్టపోతానోనని భయం వేసింది. మూడు రోజుల నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో పత్తి పంటకు ప్రాణం పోసినట్లయింది. ఇక ధైర్యంగా ఉండొచ్చు.

– కొట్టె సంపత్, రైతు, మంథని